# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 15-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు.
- బీహార్ ఎన్నికల నేపథ్యంలో `మేరా బూత్ సబ్సే మజ్‌బూత్` కార్యక్రమంలో బీజేపీ పార్టీ కార్యకర్తలతో ఆ పార్టీ సీనియర్ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు.
- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో దేశంలోని ఓడరేవులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు.
- రైల్వేల ఆధునీకరణకు ప్రభుత్వం ఏటా 2 లక్షల 56 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.
- దేశంలోని రెండు వేరు వేరు చోట్ల ఈరోజు మొత్తం 88 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు.

========================

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు పుష్పాంజలి ఘటించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను స్మరించుకుంటూ.. సామాజిక మాధ్యమంలో ఒక ప్రకటన చేశారు. యువతను ఉత్తేజపరిచి, మన దేశం పెద్ద కలలు కనేలా ప్రేరేపించిన దార్శనికుడని ఆయనను కొనియాడారు. విజయానికి వినయం, కృషి చాలా ముఖ్యమైనవని ఆయన జీవితం మనకు గుర్తు చేస్తుందన్నారు. అదే విధంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏపీజే అబ్దుల్ కలాంకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. శాస్త్రీయ మేధావి అయిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం తన అచంచలమైన దేశభక్తి, భారత్ ప్రథమం అనే సిద్ధాంతంతో విజ్ఞాన శాస్త్రం, రక్షణ, సాంకేతిక రంగ ఆవిష్కరణల్లో మన దేశాన్ని గొప్ప శిఖరాలకు తీసుకెళ్లారని పేర్కొన్నారు.

=======================

బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ `నమో యాప్` ద్వారా ఆ పార్టీ బూత్ లెవెల్ కార్యకర్తలతో ఈరోజు సంభాషించారు. `మేరా బూత్ సబ్సే మజ్‌బూత్` సంభాషణ పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భాగస్వామ్య పార్టీలైన జనతాదళ్ (యునైటెడ్) జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) ఎల్జెపీ, రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం), హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్ ఏఎం) పార్టీల అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజానుకూల విధానాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

=======================

రైల్వేల ఆధునీకరణకు ప్రభుత్వం ఏటా  రెండు లక్షల 56 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రైల్వే ప్రదర్శన అయిన 16వ అంతర్జాతీయ రైల్వే పరికరాల ప్రదర్శన-2025ను ఆయన ఈరోజు ప్రారంభించారు. 15 కి పైగా దేశాలకు చెందిన 450కి పైగా ప్రదర్శనకారులు అత్యాధునిక రైల్వే, మెట్రో ఉత్పత్తులు, ఆవిష్కరణలు ఈ కార్యక్రమంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమ ప్రారంభంలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... గత 11 సంవత్సరాలలో రైల్వేల ఆధునీకరణపై దృష్టి సారించామని చెప్పారు. దాదాపు 35 వేల కిలోమీటర్ల ట్రాక్స్ నిర్మించామని, 46 వేల కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌లు విద్యుదీకరించబడ్డాయని వెల్లడించారు. భారతీయ రైల్వే ఇప్పుడు ఒక ప్రధాన ఎగుమతి కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, ఇటీవల భారతదేశంలో తయారు చేయబడిన లోకోమోటివ్ ఆఫ్రికాకు ఎగుమతి చేయబడిందని అన్నారు. త్వరలో వందే భారత్ తదుపరి వెర్షన్ ను ప్రారంభిస్తామని అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ....

(వాయిస్ 30 సెకన్లు)

=======================

దేశంలోని రెండు వేరు వేరు చోట్ల ఈరోజు మొత్తం 88 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. మహారాష్ట్రలో సీనియర్ నక్సల్ కేడర్ కు చెందిన 61 మంది ఈరోజు గడ్చిరోలి పోలీసుల ముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో లొంగిపోయారు. కేంద్ర నక్సల్ కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లుజోల వేణుగోపాల్ రావు అలియాస్ భూపతి సహా 60 మంది ఇతర మావోయిస్టులు వారి ఆయుధాలను పోలీసులకు సమర్పించారు. వీరిపై 6 కోట్ల రూపాయల రివార్డ్ ఉంది. ఇక మరోవైపు సుక్మా జిల్లాలో ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట 27 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో పది మంది మహిళలు కూడా ఉన్నారు. లొంగిపోయిన వారిపై మొత్తం 50 లక్షల రూపాయల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టులు అడవి బాట వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని సూచించారు.

విరామం

=======================

ఆంధ్రప్రదేశ్ పర్యటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. రేపు ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఆయన రానున్నారని, శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లని దర్శించుకుంటారని చెప్పారు. ఆ తర్వాత కర్నూలులో 13 వేల 400 కోట్ల రూపాయలకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు విద్యుత్, రైల్వేలు, పెట్రోలియం, రక్షణ, పరిశ్రమలతో పాటు మరిన్ని రంగాలకు సంబంధించినవని ప్రధానమంత్రి తెలిపారు.

=======================

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో దేశంలోని ఓడరేవులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జల మార్గాల శాఖా మంత్రి సర్బానంద సోనోవాల్ అన్నారు. న్యూ మంగళూరు పోర్టు స్వర్ణోత్సవ కర్టెన్ రైజర్‌లో ఈరోజు ఆయన పాల్గొన్నారు. న్యూ మంగళూరు పోర్టు దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న ఓడరేవులలో ఒకటి అని ఈ సందర్భంగా పేర్కొంటూ..

(వాయిస్ 20 సెకన్లు)

=======================

ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో పర్యావరణహితమైన బాణసంచా (గ్రీన్ క్రాకర్స్) విక్రయాలు జరుపుకునేందుకు సుప్రీంకోర్ట్ అనుమతించింది. దీపావళి కోసం పిల్లలు ఎదురుచూస్తారని.. గ్రీన్ క్రాకర్స్‌తో వారిని పండగ చేసుకోవడానికి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ అనుమతిని మంజూరు చేసింది. పర్యావరణానికి హాని కలగకుండా మితంగా వాడేందుకు అనుమతిస్తున్నామని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది తాత్కాలిక చర్య మాత్రమేనని అక్టోబర్ 18 నుంచి 21 మధ్యనే వీటిని వినియోగించాలని స్పష్టం చేసింది. ఎన్‌సీఆర్ లోకి బయటి నుంచి ఎలాంటి పటాకులు తీసుకువచ్చేందుకు అనుమతి లేదని తెలియజేసింది.

=======================

కేంద్రీయ సైనిక బోర్డు ద్వారా మాజీ సైనికోద్యోగుల సంక్షేమ విభాగం అమలు చేస్తున్న పథకాల కింద మాజీ సైనికులు వారి కుటుంబీకులకు అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని నూరు శాతం పెంచడానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం తెలిపారు. దీంతో ఇప్పటివరకూ ఒక్కో లబ్ధిదారుడికీ నెలకు ఇస్తున్న 4 వేల రూపాయల పెన్యూరీ గ్రాంట్ ఇకపై 8 వేల రూపాయలు కానుంది. అలాగే మాజీ సైనికుల కుటుంబంలో ఇద్దరు పిల్లలకు గ్రాడ్యుయేషన్ వరకు అందించే విద్యా గ్రాంట్ 1,000 నుంచి 2,000 రూపాయలకు పెరగనుంది. వివాహ గ్రాంట్ ను ఒక్కో లబ్ధిదారుడికీ 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచారు. వచ్చే నవంబరు 1 నుంచి సమర్పించే దరఖాస్తులకు ఈ సవరించిన రేట్లు వర్తింపు కానున్నాయి.

=======================

రాజస్థాన్ లోని జైసల్మేర్ లో నిన్న తెల్లవారు జామున చోటు చేసుకున్న స్లీపర్ బస్సు అగ్ని ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 21కి పెరిగింది. తీవ్రంగా కాలిన గాయాలతో బాధపడుతున్న పదేళ్ల బాలుడు ఈ ఉదయం చికిత్స పొందుతూ మరణించాడు. జోధ్‌పూర్‌లోని మహాత్మా గాంధీ ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఐదుగురు గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉంది. అనేక మృతదేహాలు తీవ్రంగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో బాధితుల గుర్తింపును నిర్ధారించడానికి జోధ్‌పూర్, జైసల్మేర్ ఆసుపత్రులలో DNA నమూనాలను సేకరిస్తున్నారు. మరో 15 మంది గాయపడిన ప్రయాణీకులు చికిత్స పొందుతున్నారు. బాధితుల్లో ఎక్కువ మంది జైసల్మేర్, జోధ్‌పూర్ సమీప జిల్లాలకు చెందిన వారని అధికారులు తెలిపారు.

=======================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

========================